

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి. చిన్నప్పటి నుంచే బాలికల్లో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్య ప్రదర్శన, సృజనాత్మకత వంటివి పెంపొందించాలి. ఆడపిల్లలకు నచ్చిన రంగంలో వారు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించడంతో పాటు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. చిన్నతనం నుంచే ఏదైనా సాధించాలన్న పట్టుదల దానికి తగిన కృషి కనబరచాలి. క్రమశిక్షణ, సత్బుద్ధి కలిగి మంచి వ్యక్తులుగా ఉన్నతమైన జీవితం గడపాలి.

–డాక్టర్ గట్టి భార్గవి, పొగిరి పీహెచ్‌సీ, రాజాం




## పురుషులతో సమానంగా చూడాలి

మహిళలపై లింగ వివక్ష తగదు. పురుషులతో సమానంగా వారిని చూడాలి. ముఖ్యంగా ఆడపిల్లలకు త్వరగా పెళ్లిళ్లు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలి. ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు మహిళా హక్కులు, చట్టాల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి. మహిళల భద్రతకు కృషి చేయాలి. పని ప్రదేశంలో వేధింపులు ఉండరాదు. అన్ని రంగాల్లో రాణించేలా స్వేచ్ఛనివ్వాలి. అప్పుడే తమకు నచ్చిన రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తారు. ప్రస్తుతం ఏ రంగంలోనూ పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా మహిళలు రాణిస్తున్నారు.

–జీవీఎస్ఎస్ శ్యామలాకుమారి, ఎంపీడీవో, రేగిడి



## క్లుప్తంగా

### ఘనంగా సిరుల ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

**బొబ్బిలి:** స్థానిక యాదవ వీధిలో సిరుల ఎల్లమ్మ, పోతన జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్న భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ఆకులు, పసుపు కలిపి చేసిన ముద్దను పోతన్న చేతితో చిన్నారులకు రాస్తే ఎటువంటి వ్యాధులు సోకవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో పలువురు పోతన్న చేతితో పసుపు వివిధ ఆకులు కలిపిన ముద్దను చిన్నారులకు రాయించారు.

### అభ్యసన సామర్థ్యాల పరిశీలన



చార్టులపై బొమ్మల ఆధారంగా చిన్నారులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఈవో లక్ష్మణరావు

**బొబ్బిలిరూరల్:** మండలంలోని ఎ.వెలగవలస ఎంపీపీ పాఠశాలను ఎంఈవో లక్ష్మణరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలడిగి వారి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని, అలాగే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి పెట్టాలని తెలిపారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

**బొబ్బిలిరూరల్:** మండలంలోని కాశిందొరవలస పంచాయతీ, ఎరకందొరవలస గ్రామంలో బొబ్బిలి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ శిబిరానికి మొత్తం 13 గిరిజన గ్రామాల నుంచి 400 మందికి వైద్యులు ఆరోగ్య తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇదే వైద్య శిబిరాన్ని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. గిరిజనుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా వైద్యసేవలు అందివ్వడంతో పాటు తాగునీరు, భోజన వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధి శారద తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక బాధ్యత వహించాలి



సీఐ, ఎస్‌ఐలకు సూచనలిస్తున్న డీఎస్పీ రాఘవులు

**సంతకవిటి:** పోలీసులే కాదు.. ప్రజలు కూడా తమ చుట్టూ జరుగుతున్న సమస్యల పరిష్కారానికి తమవంతు సాయంగా సామాజిక బాధ్యత వహించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. మహిళలు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే నేరుగా ఎస్‌ఐ స్పందించి, వారి తరఫున కేసు నమోదు చేసేలా ఉత్తర్వులు ఇచ్చామన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, వాహనదారులను ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం చేయాలని చెప్పామన్నారు. అలాగే మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం జరగకుండా గట్టి నిఘా ఉంచాలని తెలియజేశామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఆయన వెంట రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఉన్నారు.

## జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయండి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

**రాజాం సిటీ:** పోలిపల్లి పైడితల్లి జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు కోరారు. ఇదే విషయమై స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. రాజాంలో ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 400 మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర పర్యవేక్షణకు 27 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్లు కూడా వినియోగిస్తున్నామన్నారు. స్పెషల్, రోప్ పార్టీలతో పాటు క్రైమ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జాతరకు అధిక సంఖ్యలో జనం వస్తారని భావిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు తీసుకున్నామన్నారు. 8 చోట్ల పార్కింగ్ స్థలాలు గుర్తించామని, వాటిలోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. బొబ్బిలి జంక్షన్ మీదుగా వచ్చే భక్తులు వాహనాలను పోలీసు క్వార్టర్స్ వద్ద, బొబ్బిలి వైపు నుంచి వచ్చే వాహనాలు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలం, మార్కెట్ యార్డు వద్ద పార్కు చేయాలన్నారు. అలాగే మెంటిపేట మీదుగా వచ్చే వాహనాలను ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పార్కింగ్ చేయాలని సూచించారు. బొబ్బిలి రోడ్డులోని వ్యాపారులు, ఇళ్ల యజమానులు రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయరాదని, జాతరలో సౌండ్ పొల్యూషన్ నివారణకు చర్యలు చేపట్టామన్నారు. పిక్కాట, పేకాట వంటివి నిషేధించామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్‌ఐ వై.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నామన్నారు. బొబ్బిలి వైపు నుంచి రాజాం వస్తున్న వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి గార్రాజుచీపురుపల్లి, జెండాల దిబ్బ మీదుగా రాజాం చేరుకోవాలన్నారు. అలాగే బొబ్బిలి వైపు వెళ్లే వాహనాలు బొద్దాం, జెండాల దిబ్బ చేరుకుని గార్రాజుచీపురుపల్లి చేరుకుని చీకటిపేట జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. బొబ్బిలి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

## మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి

**రేగిడి:** మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, చాటాయివలస తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగును ఆయన శుక్రవారం పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు అనుసరించాల్సిన విధానాలు, జాగ్రత్త చర్యలను తెలిపారు.

## ● మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలతో పాటు చదువు, ఆటపాటల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను శుక్రవారం సత్కరించారు. మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలను గౌరవించాలని, పని ప్రదేశంలో వారిని వేధించరాదని, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలని వక్తలు కోరారు. అనంతరం మహిళా హక్కులు, చట్టాలను తెలియజేశారు.

-రాజాం సిటీ, బాడంగి, బొబ్బిలి



బొబ్బిలి: మహిళలను గౌరవించాలని కోరుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి



రాజాం సిటీ: విద్యార్థినులను సత్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



బాడంగి: మహిళా చట్టాలు-హక్కులపై ప్రసంగిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

## అవగాహన తప్పనిసరి



అవగాహన సదస్సులో పాల్గొన్న ఐజీడీ జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్, ఇతర అధికారులు

**తెర్లాం:** అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఐజీడీ జిల్లా కో–ఆర్డినేటర్ వై.అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్, ఢిల్లీ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆహారంలో అయోడిన్ ఆవశ్యకత, అయోడిన్ లోపం వల్ల వచ్చే సమస్యలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామన్నారు. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయోడిన్ లోపం వల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అయోడిన్ లోపిస్తే థైరాయిడ్, క్రెటినిజం, ఎదుగుదల లోపం, బలహీనత, రక్తహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆకు కూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్లు, డ్రై ఫ్రూట్స్, బీన్స్, క్యారెట్, బెల్లం, చెక్కీలు తగు మోతాదులో తీసుకుంటే అయోడిన్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ ఎం.చైతన్య, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఓఆర్‌డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జీడిమామిడి తోటల్లో సస్యరక్షణపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరావు

**రేగిడి:** జీడిమామిడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు ఒక్కరోజు శిక్షణ సంకిలి గ్రామంలో శుక్రవారం ఇచ్చారు. ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు.. జీడిమామిడి సాగులో చీడపీడల నివారణపై పలు సూచనలు చేశారు. మామిడికి సంబంధించి, పూత తెగుళ్లు వచ్చేటప్పుడు కార్బన్‌డైజిమ్ ఒక లీటరుకు ఒక గ్రాము ద్రావణం, క్లోరోపైరోపాస్ 2 ఎం.ఎల్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. నేల స్వభావం ఆధారంగా మార్చి నెలలో 17 రోజుల వ్యవధిలో నీటిని పెట్టాలన్నారు. మామిడి సంచులను 50 శాతం రాయితీతో ఇస్తున్నామని, ఈ సంచులు వినియోగిస్తే మామిడి కాయ సైజు పెరగడంతో పాటు వర్షాలు, గాలులకు నష్టపోకుండా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో రాజాం ఉద్యానవనశాఖ అధికారిణి ఉమామహేశ్వరి, సర్పంచ్ పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



నువ్వు పంటను పరిశీలిస్తున్న డీపీఎం స్వామినాయుడు

**వంగర:** ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి సాగు అడిషనల్ డీపీఎం స్వామినాయుడు అన్నారు. మండలంలోని మరువాడ, కింజంగి గ్రామాల్లోని ఏటీఎం, కిచెన్ గార్డెన్ పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులంతా వరి దమ్ముకు 40 రోజుల ముందుగానే పచ్చిరొట్ట విత్తనాలు, పీఎండీఎస్ కలిపి పెంపకం చేపట్టి 45 రోజుల తర్వాత వాటిని పొలంలో కలియదున్నాలన్నారు. పంటలకు ఎటువంటి యూరియా, డీఏపీ వంటి రసాయనిక ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. గతేడాది పీఎండీఎస్ వేసిన రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీసీఎన్ఎఫ్ ఎంటీ పద్మ, యూనిట్ ఇన్‌చార్జి సింహాద్రినాయుడు, ఐసీఆర్‌పీ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మను దర్శించుకున్న డాక్టర్ రాజేష్



ఎల్లమ్మకు పూజలు చేస్తున్న డాక్టర్ తలే రాజేష్

**రాజాం:** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న సిరుల పోతన్న, ఎల్లమ్మ జాతర మహోత్సవాలకు వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం హాజరై, ఎల్లమ్మను దర్శించుకున్నారు. అందరూ బాగుండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.

## రూ.5 లక్షలతో బీసీ వసతిగృహ మరమ్మతులు

**బాడంగి:** స్థానిక బీసీ హాస్టల్(వసతిగృహం) మరమ్మతులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. సర్వశిక్ష అభియాన్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల నిధులతో శ్లాబ్ ఫ్లోరింగ్ సహా సీలింగ్, రన్నింగ్ వాటర్, టాయిలెట్స్, తలుపులు, కిటికీల ఏర్పాటు, వైరింగ్ వంటి పనులు చేస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారి ఎస్.దాస్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం శ్లాబ్ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయన్నారు.

## చురుగ్గా ఫారంపాండ్‌ల తవ్వకాలు

**రేగిడి:** ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండలంలోని సంకిలి గ్రామ జీడిమామిడి తోటల్లో ఫారంపాండ్‌ల తవ్వకాల పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఏపీవో ఎస్.హరనాథరావు వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని, అప్పుడే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. ఫారంపాండ్‌ల నిర్మాణం ద్వారా భూగర్భజలాలను సంరక్షించుకోవచ్చన్నారు.

## అదనపు విద్యుత్ వినియోగం క్రమబద్ధీకరణకు రాయితీ

**రాజాం:** గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఏపీఈపీడీసీఎల్ రాయితీ అవకాశాన్ని కల్పించిందని ఏడీఈ బీవీఎన్ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కిలో వాట్‌కు గతంలో రూ.2,250లు ఉండగా, ఇప్పుడు 50 శాతం రాయితీతో రూ.1250లకు క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించిందన్నారు. రెండు కిలోవాట్‌లు ఉంటే రూ.2,450లు, మూడు కిలోవాట్‌లు ఉంటే రూ.3,650లు, నాలుగు కిలోవాట్‌లు ఉంటే రూ.4,850లు, ఐదు కిలోవాట్‌లు ఉంటే రూ.6,050లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అదనపు విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ నెలాఖరు వరకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు.

## వితరణ

**తెర్లాం:** రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నివారణకు అవసరమైన 10 బారికేడ్లను క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ బొబ్బిలి బ్రాంచి అధికారులు తెర్లాం పోలీస్‌స్టేషన్‌కు వితరణ చేశారు. ఎస్‌ఐ సాగర్‌బాబుకు వాటిని శుక్రవారం అందజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్(కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ) కింద అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగానే ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల వేగం నిరోధించేందుకు అవసరమైన బారికేడ్లు ఇప్పుడు ఇవ్వడం జరిగిందని, దీనికిగాను ఆ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలన్నారు. కంపెనీ విశాఖపట్నం డివిజనల్ మేనేజరు వెంకటరమణ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా 18 రాష్ట్రాల్లో 2061 బ్రాంచ్‌లు ఉన్నాయని, వాటి పరిధిలో సీఎస్ఆర్ యాక్టివిటీస్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ లైజనింగ్ అధికారి రమేష్‌బాబు, ఏరియా మేనేజర్ చక్రధరరావు, బ్రాంచ్ మేనేజర్ ఆర్.తిరుపతిరావు, ఐఏ షేక్ భాషా పాల్గొన్నారు.



ఎస్‌ఐ సాగర్‌బాబుకు బారికేడ్లు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

**రేగిడి:** మండలంలోని లింగాలవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులను రాజాం వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షులు కామేశ్వరరావు, సంస్థ ప్రతినిధి గ్రంధి రవికుమార్‌లు శుక్రవారం వితరణ చేశారు. బాగా చదివి పరీక్షలు చక్కగా రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.ఈశ్వరరావు, సర్పంచ్ జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

## సర్వేను వేగవంతం చేయండి

**తెర్లాం:** మండలంలోని అన్ని గ్రామాల్లో చేపడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో రేగి రాంబాబు ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలు, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశమైన వారు.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే చేస్తున్నామని, సర్వే పూర్తికి కృషి చేయాలని కోరారు. అలాగే మండలంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పీ4 సర్వేలో వీఆర్‌వోలు కూడా పాల్గొని, సర్వే సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు.

**రాజాం సిటీ:** గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పొగిరి గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేయడంతో పాటు సర్వేలపై ఆరాతీశారు. ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలు, ఈకేవైసీ, చైల్డ్ ఆధార్ నమోదు ప్రక్రియలు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.



రాజాం సిటీ: రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

## నేత్రపర్వంగా నేత్రోత్సవం

**రాజాం సిటీ:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి 99వ జాతర పురస్కరించుకుని, నేత్రోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఇంటి వద్ద నుంచి మేళతాళాలు, వివిధ వేషధారణలతో ఊరేగింపుగా పసుపు, కుంకాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పూజల అనంతరం అమ్మవారి ప్రతిమలను గుడి నుంచి కొండంపేట గ్రామంలో ఉన్న ప్రధాన పూజారి లంకలపల్లి సత్యనారాయణ ఇంటి వద్దకు తోడ్కొని వెళ్లారు. అక్కడి నుంచి జాతర చివరి రోజు అయిన మంగళవారం చేసే ఘటోత్సవంతో అమ్మవారి గుడికి తిరిగి చేర్చడంతో జాతర ముగుస్తుంది. కార్యక్రమంలో ఈవో బీవీ మాధవరావు, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పసుపు, కుంకాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న వాకచర్ల కుటుంబీకులు

## ప్రతిపాదనలు తయారు చేయండి

**బొబ్బిలి:** స్థానిక రత్నాలనగర్ కాలనీలో కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని రాజానగర్ కాలనీ, రత్నాలనగర్, జయప్రకాష్ స్కూల్ రోడ్డు, అమ్మవారి కోనేరు గట్టు ప్రాంతాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. అక్కడి పారిశుధ్య పరిస్థితులు, శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. రత్నాలనగర్ కాలనీలో కాలువలు లేవని అక్కడి ప్రజలు ఫిర్యాదు చేశారని, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు.



రాజానగర్ కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి